తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల జ్రో॥ జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్ మహబూబాబాద్

మంగళవారం 7 జూలై 2026 | పేజీలు - 8

## ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించాలి

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- భక్తుల అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- ఆలయాల భూముల రక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలి

స్టేషన్ ఘన్పూర్, జూలై 06 (జనంసాక్షి) : నెల రోజులలో ఆలయాల అభివృద్ధిపై సమగ్ర నివేదిక అందించాలని, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి సమగ్రమైన మాస్టర్ ప్లాన్ రూపొందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హైదరాబాద్ లోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని జీడికల్, నవాబ్ పేట,



చిల్పూర్, స్టేషన్ ఘనపూర్, మల్లికుదుర్ల ఆలయాల అభివృద్ధి పై కమిషనర్ హనుమంత రావుతో కలిసి దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్లు, ఈఈ, ఈవో లతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు.

వార్త మెయిన్ 7లో

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి,జులై 06(జనంసాక్షి ): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను శాఖల వారీగా, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వెంకటులు కలసి కలెక్టర్ పాల్గొని అర్జీల స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, చట్ట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని, లాంగ్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో అందిన ముఖ్యమైన



అర్జీల వివరాలు వాంకిడి మండలం, తేజాపూర్ గ్రామం నగారే శ్యాంరావు అనే వ్యక్తి తనకు దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. తిర్యాణి మండలం, అవలగూడ గ్రామం బుర్క వెంకటి తనకు గతంలో వస్తున్న పింఛన్ ఆగిపోయిందని, కావున తిరిగి పునరుద్ధరించాలని దరఖాస్తు చేసుకున్నారు. రెబ్బెన మండలం, వక్కులం గ్రామం శ్రీరాముల పార్వతి అనే మహిళ తమ తండ్రి పేరిట గల భూమిని ఇతరులు అక్రమంగా ఆక్రమించుకున్నందున తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. కాగజ్‌నగర్ మండలం, అంకుశాపూర్ గ్రామం చునార్కార్ మురళీబాయి అను ఆమె తన భూమి పట్టా గురించిన సమస్యపై దరఖాస్తు చేసుకున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ, రాంనగర్ (కాపువాడ) శేఖ నాబోతుమ్మ తమ కాలనీలో గల రహదారిని ఆక్రమించి ఇల్లు నిర్మాణం చేస్తున్నందున చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. తిర్యాణి మండలం, భింభినిగూడ గ్రామం కొవ్వ పెద్ద రాజు తమ పట్టా భూమిలో ఎలాంటి ఒప్పందం లేకుండా పాఠశాల భవన నిర్మాణం చేపట్టడంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగజ్‌నగర్ మండలం, గువ్వలగుండి గ్రామం మిగతా 10లో..

## నీళ్లు నింపని చాతగాని ప్రభుత్వం

- ఆంధ్రకు నీల్లు... ఈ ప్రభుత్వానికి ఇసుక దోపిడీ
- మంత్రి సీతక్క అవగాహన లేని మాటలు

ఏటూరునాగారం, జులై 06(జనంసాక్షి) : కాళేశ్వరం బ్యారేజ్ ప్రాజెక్టు పరిధిలోని మేడికగడ్డ, సుందిళ్ల, కన్నెపల్లి ఇతర పంప్‌హౌజ్‌లలో నీటిని ఎందుకు నింపడం లేదని, నీరు నింపలేని చాతగాని ప్రభుత్వమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తన ఇంటి వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్ అద్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాపై ఉన్న కక్ష రైతులపై తీయవద్దని, కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా ఈ ప్రభుత్వం విడిచిపెడుతుందని, కాళేశ్వరం ప్రాజెక్టు ఈ రాష్ట్రానికి ఒక వరమని అన్నారు. మేడిగడ్డ వద్ద పగుళ్ల వచ్చిన పిల్లర్లకు మరమ్మతులు చేసుకోవాలని నేషనల్ సెఫ్టి అథార్టి కమిటీ ఏడాదిన్నర కిందనే చెప్పిందని, కానీ సీఎం రేవంత్‌రెడ్డికి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి సీతక్కకు మరమ్మతులు చేసేందుకు కంకర దొరకడం లేదా... సిమెంట్ దొరకడం లేదా అని ఎద్దేవా చేశారు. మరమ్మతులు చేయలేని చాతగాని మీ పాలన వల్ల వరంగల్, కరీంనగర్ రైతులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. కేవలం బ్యారేంజ్‌లలో నీరు నింపితే ఇసుకను తోడుకునే అవకాశం ఉండదని భావించిన కాంగ్రెస్ ప్రభుత్వం నీరు నింపకుండా ఇసుకను తోడుకుంటుందని



ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రేవంత్‌రెడ్డి గురువు చంద్రబాబుకు నీరు అక్రమంగా పంపేందు పావులు కదిపి ఇసుకను తోడుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ రైతులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కేసీఆర్, కేటీఆర్‌లు భగీరథ ప్రయత్నం చేసి కాళేశ్వరాన్ని కట్టారని, దేవుడు పేరు పెట్టిన కాళేశ్వరాన్ని కూలేశ్వరమని మంత్రి సీతక్క వ్యగ్యంగ మాట్లాడడం బాదాకరం అన్నారు. కేటీఆర్ పర్యటను అడుగడుగునా అడ్డుకోవాల్సి అవసరం ఏముందని, కన్నెపల్లి వద్ద నీరు లేకుండా వెల వెలబోయిన గోదావరి దృశ్యాలు బయటపడుతాయని పోలీసులతో నిర్బందించారని తెలిపారు. కానీ అన్ని అడ్డంకులను దాటి బ్యారేజీని కేటీఆర్ సందర్శించి అసలు విషయం రైతులకు, ప్రజలకు వివరించారన్నారు. మంత్రులకు కాళేశ్వరం ప్రాజెక్టులపై ఏబీసీడీలు కూడా తెలియదని, కేవలం ప్రెస్‌మీట్లు పెట్టి చెప్పినంత మాత్రాన సాక్షాలు ఎప్పుడు మారవని తెలిపారు.

### డి సీల్టేషన్‌ను అడ్డుకునేందుకు పాదయాత్ర

సీతమ్మ సాగర్ కింద బ్యాక్ వాటర్‌లో ఇసుక కలిసిపోతుందని తప్పుడు నివేదికలతో చేపట్టిన డి సీల్టేషన్ ను అడ్డుకొని తీరుతామని, రైతులను కూడగట్టుకొని పాదయాత్ర చేపడుతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు తెలిపారు. ఆ జిల్లాలోని కలెక్టర్ రెండు లక్షల క్యూబిక్ మీటర్లు అనుమతి ఇస్తే ములుగు జిల్లా అధికారులు నాలుగు కోట్లకు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. మంత్రి పొంగులేని, సీతక్క మీద డి సీల్టేషన్ పై ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు శ్వేత పత్రం విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. మంగపేట మండలం కత్తిగూడెం వద్ద 1500ల ఎకరాలకు నీరుఇచ్చే శివగంగా ప్రాజెక్టు నిర్మించకుండా సీతమ్మ సాగర్‌ను తెరపైకి తెచ్చారని, కేవలం ఇసుకను దోచుకునేందుకే తెర పైకి తెచ్చారన్నారు. ఇసుక లారీలను సాయంత్రం 6 మిగతా 10లో..



## జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల పరిశీలన

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

ములుగు ప్రతినిధి, జులై 06(జనంసాక్షి) : నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణానికి సంబంధించిన తుది దశ పనులను వేగవంతంగా పూర్తి చేసి, నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తుది దశకు చేరుకున్న నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భవనంలోని వివిధ విభాగాలు, కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, పార్కింగ్, పచ్చదనం, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. భవన నిర్మాణానికి సంబంధించిన మిగిలిన పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, ప్రతి పనిలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు, ఉద్యోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుది దశ పనులను వేగంగా పూర్తి చేసి నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనాన్ని మిగతా 10లో..

# ప్రజలకు ఇచ్చిన హామీల అమలే మా లక్ష్యం: ఎమ్మెల్యే నాయిని




**హనుమకొండ, జులై 7 ,(జనం సాక్షి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 11వ డివిజన్ దత్తక్షేత్రం, కాపువాడ ప్రాంతాల్లో సుమారు రూ. 70 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం రోజున వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులునాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అత్యవసర అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు చెప్పారు.ఒకే ప్రాంతంలో రెండుసార్లు పనులు జరిగి ప్రభుత్వ ధనం వృథా కాకుండా శాస్త్రీయ ప్రణాళికతో పనులు చేపడుతున్నామని తెలిపారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రభావం లేని ప్రాంతాల్లో ముందుగా రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణాలు చేపడుతున్నామని, అవసరాలను బట్టి పనులను ఏ, బీ కేటగిరీలుగా విభజించి అమలు చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ కాళేశ్వరం పర్యటనపై ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రూ. 30 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో లక్ష కోట్లకు పైగా ఖర్చు చేశారని ఆరోపించారు. నిర్మించిన ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టు దెబ్బతిన్నప్పటికీ ఇప్పుడు కాళేశ్వరం సందర్శించి విమర్శలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని అన్నారు. ముందుగా తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా వరంగల్ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హనుమకొండలో ఇటీవల జరిగిన భూ వేలంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే ఖండించారు. మార్కెట్ విలువ కంటే తక్కువ ధరకే భూములు విక్రయించారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని చెప్పారు. నిజంగా అంత తక్కువ ధరకే భూమి దొరుకుతుందని భావిస్తే వేలంలో పాల్గొని కొనుగోలు చేయాలని ప్రతిపక్ష నాయకులకు సవాల్ విసిరారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చే విధంగా పూర్తి పారదర్శకంగా వేలం నిర్వహించామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు ,మాజీ ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు,అధికారులు,స్థానిక కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## వరంగల్ డీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో
# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన




**వెంకటాపూర్(రామప్ప),జులై 6 (జనం సాక్షి ):-** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నల్లగుంటగ్రామంలో సోమవారం వరంగల్ డీసీసీ బ్యాంక్ ములుగు శాఖ,వెంకటాపూర్ పిఏసిఎస్ ఆధ్వర్యంలో,నాబార్డ్ వారి ఆర్థిక సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ భూక్యా శ్రీదేవి శంకర్ హాజరై మాట్లాడుతూ డిసిసి బ్యాంక్ సేవలు వినియోగించుకోవాల్సిందిగా తెలియజేశారు.బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ కార్తీక్ రెడ్డి ప్రజలకు బ్యాంక్ ఖాతా,పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్ యొక్క ప్రాముఖ్యత, పిఎం జెజెబివై (ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన),పిఎంఎస్బివై (ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన),కేవైసీ,రీ కేవైసీ, అలాగే బ్యాంకు ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాల గురించి వివరంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ తంగళ్ళపల్లి శ్రీధర్,పిఏసిఎస్ సిబ్బంది యాట లింగయ్య,కోటయ్య గ్రామస్తులు నరసింహారెడ్డి,మేర్గు మల్లయ్య, బుర్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## 15 మిస్సింగ్ మొబైల్స్‌ను గుర్తించి బాధితులకు అందజేసిన ములుగు పోలీసులు

- మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి
- జిల్లా ఎస్పి కేకన్ సుధీర్ రామనాథ్.



**ములుగు బ్యూరో,జూలై06(జనం సాక్షి):-** ములుగు జిల్లా ములుగు పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఆన్లైన్ (సిఈఐఆర్ పోర్టల్ ) ద్వారా ఫిర్యాదు చేయగా ఫిర్యాదు నమోదు చేసుకున్న స్టేషన్ సిబ్బంది,వాటిని తిరిగి బాధితులకు అప్పగించడంలో భాగంగా ములుగు ఐటీ కోర్ టీం సహాయంతో ఈ నెలలో మిస్సైన 15 మొబైల్ ఫోన్లను విజయవంతంగా గుర్తించి, వాటిని ఈ రోజు బాధితులకు ఎస్పి చేతుల మీదుగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ ములుగు పోలీస్ స్టేషన్ సిబ్బంది మరియు ఐటి కోర్ టీమ్ ను అభినందించారు.వారి కృషి వల్ల తక్కువ సమయంలోనే మొబైల్ ఫోన్లు తిరిగి సాధించగలిగామని పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందికి మిస్సింగ్ మొబైల్స్ రికవరీపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని,ఫిర్యాదులపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.అదేవిధంగా ప్రజలు తమ వ్యక్తిగత వస్తువుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించకుండా జాగ్రత్తగా ఉంచుకోవాలని, మొబైల్ ఫోన్లు కోల్పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేసుకొని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పి రవీందర్, ములుగు ఎస్ఐ చంద్రశేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు

## సొసైటీ చైర్మన్ భూక్యా గోపాల్ నాయక్‌కు సన్మానం
### గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా భద్రు నాయక్



**చెన్నారావుపేట, జులై 6 ( జనం సాక్షి ):** చెన్నారావుపేట సొసైటీ చైర్మన్‌గా నూతనంగా నియామకమైన భూక్యా గోపాల్ నాయక్ ను గిరిజన ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా భద్రు నాయక్ సన్మానించారు. సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆశీస్సులతో గిరిజన నాయకులు భూక్యా గోపాల్ నాయక్ ను గుర్తించి సొసైటీ చైర్మన్ గా అవకాశం ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక సంఘం నాయకులు భూక్యా తిరుపతి నాయక్, అరవింద్ నాయక్, వీరు నాయక్, స్వామి నాయక్, రాజు నాయక్, సురేష్ నాయక్, రఫీ నాయక్, మహేందర్ నాయక్, రాజేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన మాట నెరవేరుస్తా -కార్మిక శాఖ మంత్రి వివేక్



**రామకృష్ణాపూర్, జులై 06(జనంసాక్షి):** ఇచ్చిన మాట ప్రకారం క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు చేస్తామని రాష్ట్ర గనుల శాఖ మంత్రి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారు. మార్నింగ్ వాకింగ్ లో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో మంత్రి పర్యటించారు. ప్రజల నుండి నేరుగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలను నుండి వచ్చిన ఆర్జీలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ వార్డులో అభివృద్ధి పనుల కొరకు నాలుగు కోట్ల 80 లక్షల రూపాయల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రతి కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీలు సంవత్సర కాలంలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. 40 కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్న అమృత్ స్కీం ద్వారా ఇంటింటికి నల్ల కనెక్షన్లు ఇప్పిస్తామన్నారు. తుగ్లక్ ఆలోచనతో కాళేశ్వరం ప్రాజెక్టు పుట్టిందని ఈ ప్రాజెక్టుతో రాష్ట్ర రైతాంగానికి ఒరిగిందేమీలేదని ఎద్దేవా చేశారు. మార్నింగ్ వాక్ లో మందమర్రి తహసిల్దార్ పొనకంటి సతీష్, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, కౌన్సిలర్లు బీమా మల్లేష్, కూతురు ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వద్దాల శ్రీనివాస్, డిసిసి కార్యదర్శి గోపతి బానేష్, నాయకులు పల్లె రాజు, సుధాకర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ వేగంగా కొనసాగుతోంది
### కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో. (జనంసాక్షి):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ వేగంగా కొనసాగుతోంది అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారి సదయ్య, సూపర్‌వైజర్ జితేందర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌కు గణన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రం 79 లో ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నూతన ఓటర్ల నమోదు, మరణించిన ఓటరు పేర్లు తొలగింపు, చిరునామా మార్పులు సేకరిస్తున్నారని, ప్రజలు సహకరించాలని కోరారు. గణన ప్రక్రియను వంద శాతం విజయవంతం చేసి పారదర్శకంగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

# విద్యుత్ ఘాతంతో గేదె మృతి



**కడెం: జూలై 6(జనం సాక్షి)** విద్యుత్ ఘాతంతో గేదె మృతి చెందిన ఘటన కడెం మండలంలోని మాసాయిపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన యువరైతు మామిడిపల్లి రవీందర్‌కు చెందిన గేదెలు సోమవారం రోజున ఉదయం మేతకు వెళ్లిన సమయంలో గ్రామంలోని రోడ్డుకు అతి సమీపంలో ఉన్న ట్రాన్స్ఫర్ వైరుకు ఒక గేదె తగిలి అక్కడికక్కడే మృతి చెందడంతో బర్ల కాపరి గ్రామస్థులకు సమాచారం అందించాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు హుటా హుటిన అక్కడికి చేరుకున్నారు. విద్యుత్ అధికారులు, వెటర్నరీ ప్రభుత్వ అధికారులు అక్కడికి చేరుకొని గేదె మృతి చెందిందని నిర్ధారించారు. గేదె మృతి చెందడంతో బాకీ చేసి మరి నూతనంగా గేదెల పెంపకం పెట్టుకున్న యువరైతు రవీందర్ కన్నీరు మున్నీరయ్యారు. మృతి చెందిన గేదె విలువ దాదాపు రూ,, 80 వేల వరకు ఉంటుందని, విద్యుత్ అధికారులు నాయకులు స్పందించి తమకు నష్టపరిహారం ఇప్పించి న్యాయం చేయాలని రవీందర్ అధికారులను కోరారు.

## బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిస్తాం



**రెబ్బెన,జూలై06 (జనంసాక్షి):** కొమురం భీం జిల్లా రెబ్బెన మండలం గోలేటి టౌన్షిప్‌లో సోమవారం డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సమీపంలోని ఎమ్మార్పీఎస్ జెండా వద్ద జరిగిన కార్యక్రమంలో నాయకులు బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సింగరేణి ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ బుడిది గోపాలకృష్ణ మాట్లాడుతూ, దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి బాబు జగ్జీవన్ రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. బాబూజీ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి ప్రజాసేవ వరకు దాదాపు ఐదు దశాబ్దాల పాటు దేశానికి సేవలందించారని, రక్షణ, వ్యవసాయం, కార్మిక శాఖల మంత్రిగా విశిష్ట సేవలు చేశారని పేర్కొన్నారు. 1971 భారత్–పాకిస్తాన్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రిగా దేశాన్ని విజయపథంలో నడిపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో లింగంపల్లి ప్రభాకర్, కుర్రాల రాజేందర్, మాటూరి లక్ష్మీనారాయణ, జంగాపల్లి రాజేష్, శనిగారపు కిరణ్‌కుమార్, నామాల సుధాకర్, దూడల దశరథ్, ఇగురపు రాజగోపాల్, జంగంపల్లి రవి, రోషన్, ముష్కరాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఉండాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో జూలై 05, (జనంసాక్షి)** దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులందరూ తప్పనిసరిగా ప్రతి రోజూ ముఖ గుర్తింపు హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి వరకు బీటీ రోడ్డు

- రూ.13 కోట్లతో శంకుస్థాపన
- కాంగ్రెస్ పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం
- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్





**జనం సాక్షి.ఎల్కతుర్తి: 6** జులై, హనుమకొండ జిల్లా ఎల్క తుర్తి మండలం..హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి వరకు కుడా నిధులతో రూ.13 కోట్ల వ్యయంతో చేపట్టనున్న 3.5 కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కుడా వైస్ చైర్‌పర్సన్ హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీలతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఎల్కతుర్తి జంక్షన్ నుండి మడిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా కృషి చేసిన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, కుడా వైస్ చైర్‌పర్సన్ ఒ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఎల్కతుర్తి మండల ప్రజలకుమెరుగైన రవాణా సౌకర్యం అందడంతో పాటు వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్య రంగాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రహదారి వెంట ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమై భూముల విలువ కూడా పెరుగుతుందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోకోర్టు, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి కీలక మౌలిక వసతులు ఏర్పాటవుతున్న నేపథ్యంలో ఈ రహదారి మరింత ప్రాధాన్యం సంతరించుకుందని, భవిష్యత్తులో ఎల్కతుర్తి అభివృద్ధిలో ముందంజలో నిలుస్తుందని మంత్రి తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే మండలంలో పెండింగ్‌లో ఉన్న ఇతర రోడ్డు అభివృద్ధి పనులను కూడా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ మాజీ మండల అధ్యక్షులు ఇంద్ర సేనారెడ్డి మాజీ సింగల్ విండో అధ్యక్షులు గోలి రాజేశ్వర్ రావు. బక్కి వెంకన్న అక్తర్ అలీ మొదలగు వివిధ గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కార్యదర్శులు ఉపాధ్యక్షులు సర్పంచులు మొదలగువారు పాల్గొన్నారు.

# కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక బిజెపి పాలన మార్పుకై తిరుగుబాటు

- సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ
- సిపిఐ జిల్లా కార్యదర్శి బి .విజయ సారధి పిలుపు
- రామ్ లీలా మైదానంలో లక్షలాదిమందితో బిజెపి మోడీ ప్రభుత్వ మార్పు కై భారీ నిరసన ఆందోళన జయప్రదం చేయండి




**తొర్రూరు జూలై 6 (జనం సాక్షి) :** తొర్రూరు మండల కేంద్రంలో జరుగుతున్న సిపిఐ మహబూబాబాద్ జిల్ల రాజకీయ సైదాంతిక శిక్షణా తరగతులను 2 వ రోజు సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ కేంద్ర బిజెపి మోడీ సర్కార్ అవలంబిస్తున్న కార్మిక ప్రజాకర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మోడీ ప్రభుత్వ మార్పు కోసం బిజెపి ప్రభుత్వంపై తిరుగుబాటు చేయడానికి సెప్టెంబర్ 1న లక్షలాది మందితో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించ తలపెట్టినామని రామ్ లీలా మైదానంలో లక్షలాదిమంది తో భారీ నిరసన ఆందోళన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు మోడీ 12 ఏళ్ల పాలనలో దేశం వెనక్కి పోయిందన్నారు మోడీ అంబానీ ఆదానీలకే 12 ఏళ్ల కాలం పాటు పని చేశాడని దేశంలో ఏ ఒక్కరికి మోడీ చేసిందేమీ లేదన్నారు దేశంలో మోడీ పాలనలో పేదరికం పెరిగిపోయిందని నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు ఇటు కార్మికులను ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ నడ్డి విరుస్తున్నాడు అన్నారు నల్ల చట్టాలను తీసుకువచ్చి కార్మికులను మోసం చేశాడన్నారు దేశంలో 140 కోట్ల మంది ప్రజలు మోడీపై తిరుగుబాటు చేసేందుకు సిద్ధమైనారని సెప్టెంబర్ 1న రామ్ లీలా మైదానంలో మోడీపై ఇక తిరుగుబాటు తప్పదని పిలుపునిచ్చారు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరీ చేయాలన్నారు సిపిఐ బలోపేతానికి శిక్షణ శిబిరాలు తోడ్పడతాయని రానున్న కాలంలో జిల్లాలో ప్రజా సమస్యలపై మిలిటెంట్ ఉద్యమాలు చేస్తామని పిలుపునిచ్చారు అనంతరం నేడు వివిధ అంశాలపై సింగు నరసింహారావు శంకర్ నారాయణ జితేందర్ రెడ్డి విజయసారథి ప్రతినిధులకు క్లాసులు బోధించారు . శిక్షణా తరగతులలో సిపిఐ మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వరరావు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి అజయ్ సారధి రెడ్డి నల్లు సుధాకర్ రెడ్డి కట్టెబోయిన శ్రీనివాస్, ఓమా బిక్షపతి,బందు మహేందర్,కిరణ్, లక్ష్మణ్, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజు పాండురంగ చారి, వరిపల్లి వెంకన్న,నెల్లూరు నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రతినిధులు వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం : జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో. (జనంసాక్షి):** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం అని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి మొత్తం 16 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎస్పీ, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు చేశారు. ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ, సంబంధిత పోలీస్ స్టేషన్ల సిఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని, శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారుల సహకారంతో వాటిని పరిష్కరిస్తున్నామని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

# తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల జూలై 6, జనంసాక్షి** కుక్కలకు వాటి పిల్లలకు తప్పనిసరిగా రేబిస్ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ జూనోసిస్ పురస్కరించుకుని సోమవారం మంచిర్యాల పట్టణంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమానికి జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డా. యాకూబ్ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ సుదమల్ల హరికృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెంపుడు జంతువుల యజమానులు తప్పనిసరిగా కుక్కలు, పిల్లలకు రేబిస్ టీకాలు వేయించాలని తెలిపారు. మనుషుల నుండి జంతువులకు, జంతువుల నుండి మనుషులకు జూనోటిక్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, రైతులు, పశుపోషకులు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని, జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న జంతువులను వేరుగా ఉంచడం, పాలు, మాంసాన్ని పరిశుభ్రంగా నిర్వహించడం, చనిపోయిన జంతువులను శాస్త్రీయ పద్ధతిలో పారవేయడం, అనుమానాస్పద లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే పశు వైద్యులను సంప్రదించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రేబిస్ వ్యాధి 100 శాతం నివారించ దగినదని, కుక్కలు, పిల్లలకు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలు వేయించడం ద్వారా కుటుంబాలు, సమాజాన్ని సురక్షితంగా ఉంచవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన జంతువులు - ఆరోగ్యకరమైన మనుషులు - ఆరోగ్యకరమైన సమాజం లక్ష్యంతో అందరం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా 32 పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డా. శాంతి రేఖ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సోనియా, సహాయకులు గోవర్ధన్, గోపాలమిత్ర వేణు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి గ్రామ పంచాయతీ భవన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

## క్లోజ్ చేసిన వర్క్ ఐడీని తిరిగి యాక్టివ్ చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి



**నెన్నెల, జులై 6 (జనం సాక్షి):** నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయడంతో పాటు, ఆన్లైన్‌లో క్లోజ్ చేసిన వర్క్ ఐడీ: 22:3634013005ను తిరిగి యాక్టివ్ చేయాలని కోరుతూ నిర్మాణ బాధ్యుడు ఇందురి రమేష్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం, గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో పనులు చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనుల కోసం వ్యక్తిగతంగా అప్పులు చేసి ఖర్చు చేసినప్పటికీ, ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు పూర్తిగా విడుదల కాలేదన్నారు. అంతేకాకుండా, ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా సంబంధిత అధికారులు ఆన్లైన్‌లో వర్క్ ఐడీని క్లోజ్ చేయడంతో పెండింగ్ బిల్లుల ప్రాసెసింగ్ నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి కూడా పెరుగుతోందని తెలిపారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిశీలించి, క్లోజ్ చేసిన వర్క్ ఐడీని తిరిగి యాక్టివ్ చేసి, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ వినతిపత్రాన్ని అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ)కు కూడా సమర్పించినట్లు పేర్కొన్నారు.

# ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్
- హనుమకొండ పోలీస్ స్టేషన్ సందర్శించిన సీపీ



**వరంగల్ బ్యూరో, జూలై 06 (జనం సాక్షి)** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి ప్రజలకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సోమవారం ఆమె తొలిసారిగా హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను తనిఖీ చేసి, వాటి స్వాధీనానికి గల కారణాలు, కేసుల పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తదుపరి పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు నమోదులు, ఇతర పరిపాలనా అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను తెలుసుకుని, వారి విధి నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, పోలీసులు ప్రజల సేవకులనే భావనతో విధులు నిర్వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి రసీదు అందజేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించారనే నమ్మకం ప్రజల్లో కలిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను అనవసరంగా ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా చూడాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వచ్చే అత్యవసర ఫిర్యాదుల విషయంలో విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, వెంటనే స్టేషన్ అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే శాఖాపరమైన సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ఇకపై పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే సమర్పించాలని, వాటి పరిష్కార ప్రక్రియను స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ పర్యవేక్షించి, బాధ్యతాయుతంగా నిర్వహించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ఏసీపీలు నర్సింహరావు, సత్యనారాయణ, హనుమకొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

## బోడ మాణిక్యం తండా సర్పంచ్ భూక్య ఉమామోహన్ నాయక్



**చెన్నారావుపేట, జూలై 6 ( జనం సాక్షి):** పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బోడ మాణిక్యం తండా గ్రామ సర్పంచ్ భూక్య ఉమా మోహన్ నాయక్ అన్నారు. సోమవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు బోడ మాణిక్యం తండా గ్రామంలోని నెంబర్ 3 కాలనీలో ఇందిరమ్మ లబ్ధిదారులు కందికట్ల సుమలత పరమాత్మ ఇంటికి ముగ్గు పోసి ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియచేసి త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ.5 లక్షలలను విడతల వారిగా అందుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు భూక్య నర్సు నాయక్, ఉప సర్పంచ్ సునీత వీరన్న నాయక్, వార్డ్ మెంబర్లు రాజు, ఏకాంబరం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కవిత కీమా నాయక్, కందికట్ల అనిల్, మాతంగి కొమరయ్య, కందిగట్ల ప్రశాంత్, హుస్సేన్, జన్ను రాములు, గిరిబాబు, సిద్దు, స్వామి, అయ్యగారు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సిద్దేశ్వర స్వామికి పంచామృత అభిషేకం



**చెన్నారావుపేట, జూలై 6( జనం సాక్షి):** మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వర ఆలయంలో సోమవారం భ్రమరాంబ సమేత శ్రీ సిద్దేశ్వర స్వామికి పంచామృత అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు బిక్షమయ్య శాస్త్రి, సాయి శాస్త్రి, గణేష్ శాస్త్రిలు శ్రీ సిద్దేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృత అభిషేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## గొల్లభామ తండా గ్రామ సర్పంచ్ గుగులోతు బాలు



**చెన్నారావుపేట, జులై 6 ( జనం సాక్షి):** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గొల్లభామ తండా గ్రామ సర్పంచ్ గుగులోతు బాలు అన్నారు. సోమవారం మండలంలోని గొల్లభామ తండా గ్రామంలో బురదమయంగా మారిన పలు వీధులలో బ్లీచింగ్ పౌడర్ ను చల్లించారు. ప్రతి ఒక్కరూ వర్షాకాలంలో తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

## తిమ్మరాయినిపహాడ్ గ్రామ సర్పంచ్ ధారావత్ రమేష్



**చెన్నారావుపేట, జులై 6 ( జనం సాక్షి):** విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, స్పూన్ లను తిమ్మరాయిని పహాడ్ గ్రామ సర్పంచ్ ధారావత్ రమేష్ ఉచితంగా పంపిణీ చేశారు. సోమవారం తిమ్మరాయిని పహాడ్ గ్రామంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులకు తన సొంత డబ్బులతో ప్లేట్లు, గ్లాసులు, స్పూన్ లను అందజేశారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలని సూచించారు. అనంతరం బాలసభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బానోతు రవి, వార్డు సభ్యులు మంద నరేష్, విజయ్, పంచాయితీ కార్యదర్శి రాంబాబు, జిపివో దేవేందర్, ప్రధానోపాధ్యాయులు నాగోతు శౌరీలు, ఉపాధ్యాయులు మాదవి, సుష్మ, కారోబార్ యాకూబ్ పాషా, విద్యార్థులు, పాల్గొన్నారు.

## మారుమూల గ్రామలకు ఆర్టీసి బస్సు సౌకర్యం



**రెబ్బెన,జూలై06(జనం సాక్షి):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గంగాపూర్,తుంగేడ,మద్వాయిగూడ మారుమూల గ్రామాలకు ఆర్టీసి అధికారులు ప్రజలు కోరిక మేరకు బస్ సౌకర్యం కల్పించారు. తుంగెడలో మాజీ డిసిసి అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు పచ్చజెండ ఊపి బస్ ను ప్రారంభించారు.చాలా సంవత్సరాల తర్వాత ప్రజలకు బస్ సౌకర్యం కల్పించడంతో ప్రజలు సంతోషంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి,ఆర్టీసి అధికారులకు కృతజ్ఞత తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీఏ మెంబర్ లావుడ్య రమేష్, సర్పంచ్ వెంకటేశం చారి,నాయకులు దుర్గం మహేష్,నగరం భీంరావ్,మాజీ సర్పంచ్లు పర్వతాలు,ముంజం రవీందర్,పల్లె రాజేశ్వర్ రావు,టౌన్ అధ్యక్షులు వనమాల మురళీ,పుదారి హరీష్,దోశ్రీ నిలయ్య,యువనేత సోనాలే సంతోష్ బాబు, బామినీ శ్రీనివాస్,వెంకటి,దుర్గం తారాబాయి,దుర్గం లానుబాయి,దుర్గం మంజుల డోంగ్రి భారతి,డోంగ్రి బుచ్చక్క డోంగ్రి లక్ష్మి పాల్గొన్నారు.

## 94 మందికి ఇద్దరు టీచర్లే..!

### సిరికొండ ఎంపీయూపీఎస్‌లో ఉపాధ్యాయుల కొరత



**సిరికొండ (జనం సాక్షి) జులై 06:** సిరికొండ మండలంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత విద్యార్థుల చదువుపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు పేందూర్ మహేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో మొత్తం 94 మంది విద్యార్థులు ఉండగా, కేవలం ఇద్దరు ఉపాధ్యాయులతోనే బోధన కొనసాగుతుండటంతో పాఠాలు సక్రమంగా సాగడం లేదని విద్యార్థులు వాపోయారు. ఇప్పటికే తమ చదువుకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అవసరమైన సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు పేందూర్ మహేందర్ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

## ఎస్ఐఆర్ ఓటర్ స్లిప్పును

### ఎన్యుమరేటర్స్ లేదా బిఎల్ఓలె నింపేలా చర్యలు చేపట్టాలి

- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎండీ యాకూబ్
- మున్సిపల్ కమిషనర్‌కు సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి



**తొర్రూరు , జులై 06 (జనం సాక్షి):**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఓటర్ స్లిప్పులలో ప్రజలు ఎలా నింపాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని... ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో విధులు నిర్వహించే ఎన్యుమరేటర్స్ బిఎల్వోలు నింపేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిపిఎం పార్టీ తొర్రూరు మండల కార్యదర్శి ఎండీ యాకూబ్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐ ఆర్ ప్రక్రియ చేస్తున్న ఓటర్ లిప్ లలో ఎలా నింపాలో ప్రజలకు తెలియక ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తొర్రూరు మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ స్లిప్పులను ఎలా నింపాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా ఎలా నింపితే ఓటరు ఉంటుందో ఊడుతుందో అనే భయాందోళనలో ప్రజలు ఆందోళన చెందుతున్నారని అన్నారు. అలాకాకుండా ఇంటి వద్దకే వచ్చి ఎన్యుమరేటర్స్ కానీ బిఎల్వోలు కానీ ఓటర్ స్లిప్పులను నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తొర్రూరు పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్, సిపిఎం పార్టీ సభ్యులు శ్రీరంగం రాధ రామకృష్ణ, దస్తరి భాగ్య, బండి వసంత, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ మైనింగ్ సర్దార్‌లకు ఓవర్ మెన్ హోదా కల్పించాలని వినతి



**శ్రీరాంపూర్(జనంసాక్షి):** క్యాడర్ స్కీం ప్రకారం అర్హులైన సీనియర్ మైనింగ్ సర్దార్ లకు తక్షణమే ఓవర్ మెన్ గ్రేడ్ బి ప్రమోషన్లు కల్పించి అప్పటివరకు వారి హోదాకు సంబంధించిన విధులనే అప్పగించాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయుసి ఏరియా సింగరేణి జీఎం కార్యాలయంలో సోమవారం నిరసన తెలియజేసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయుసి శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా మాట్లాడుతూ 2016,2017 బ్యాచ్లకు చెందిన సీనియర్ మైనింగ్ సర్దార్లకు క్యాడర్ స్కీం ప్రకారం మూడేళ్ల సర్వీస్ పూర్తిచేసిన అనంతరం ఓవర్ మెన్ గ్రేడ్ బి హోదాకు అర్హులని అయినప్పటికీ యాజమాన్యం ఓవర్ మెన్ ఖాళీలు లేవు అనే కారణంతో వారి ప్రమోషన్లు నిలిపివేస్తున్నరని అన్నారు.ఓవర్ మెన్ ప్రమోషన్ ఇవ్వకుండానే వారితోనే ఓవర్మెన్ విధులు నిర్వహింప చేస్తున్నారని దీనివలన సంస్థలో ఓవర్ మెన్ల అవసరం, ఖాళీలు కనబడడం లేదన్నారు.పోస్టులు ఖాళీలుగా ఉండకుండా యాజమాన్యం కృత్రిమంగా తగ్గినట్లు చూపిస్తూ అర్హులైన ఉద్యోగులకు రావాల్సిన ప్రమోషన్లు మూడేళ్లు పూర్తయిన వారికి ప్రమోషన్లు కల్పించడం లేదన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి క్యాడర్ స్కీం ప్రకారం గ్రేడ్ బి ప్రమోషన్లు కల్పించాలని,కల్పించే వరకు సీనియర్ మైనింగ్ సర్దార్లకు ఓవర్ మెన్ విధులు అప్పగించరాదని,సంస్థలో ఓవర్ మెన్ ఖాళీలు భర్తీ చేయడానికి యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు,మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వరరావు,బ్రాంచ్ మైనింగ్ స్టాఫ్ అధ్యక్షులు శ్రీనివాస్,నాయకులు నరసయ్య,శంకరయ్య, క్రాంతి,అఖిల్,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా పూర్తిచేయాలి

- బీఎల్ఏలకు చైర్‌పర్సన్ శ్రీలక్ష్మీరామానంద్ దిశానిర్దేశం
- 25వ వార్డులో ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ



**నర్సంపేట, జూలై 6 (జనం సాక్షి):** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ బీఎల్ఏలకు సూచించారు. సోమవారం 25వ వార్డులో ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను అందజేస్తూ ఆమె బీఎల్ఏలకు మార్గనిర్దేశం చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలను నిబంధనల మేరకు ఖచ్చితంగా పూరించాలని, ఓటర్ల వివరాలను పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని, అవసరమైన సవరణలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి అర్హత కలిగిన ఓటరుకు పూర్తి సహకారం అందించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తిచేసి ఓటరు హక్కును పరిరక్షించాలని బీఎల్ఏలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కాట ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్ కిసరి వెంకటేశ్వర్లు, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి రమేష్, బీఎల్ఓ చింతల మౌనిక, కాంగ్రెస్ నాయకులు కిసరి నరేందర్, సిలువేరు కిరణ్, కొలువుల వెంకటేశ్వర్లు, సిలువేరు రవీందర్, చింతల కార్తీక్ రెడ్డి, ఎర్రబెల్లి రమేష్, కీసరి రాజీవ్, గుడికందుల సదానందం, కొలువుల గోపి, కాటబోయిన సాంబయ్య, మెరుగు కిరణ్, మొట్ల లావణ్య, ముద్రబోయిన రాజు, కాట అఖిల్, స్వామిశెట్టి శేఖర్, కాట రాహుల్, నల్లగొండ వంశీ, కొలువుల ఎల్లయ్య, కొలువుల స్వామి, గుండు రవిరాజ్, బన్నే గణపతి, గుడికందుల శీను, అపరాధపు సుమలత, అందె వినోద తదితరులు పాల్గొన్నారు.

## సైనికుల సేవలను దేశం ఎప్పటికీ మరువబోదు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- ఆర్మీ జవాన్‌కు ఘన నివాళి



**శాయంపేట, జూలై 6( జనం సాక్షి):** సైనికుల సేవలను దేశం ఎప్పటికీ మరువబోదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ అరికిళ్ల ప్రవీణ్ సంవత్సరిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జవాన్ ప్రవీణ్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశ సరిహద్దుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. అరికిళ్ల ప్రవీణ్ యువతకు ఆదర్శమని, ఇలాంటి వారిని సమాజం ఎప్పటికీ గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం జవాన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జవాన్ తల్లిదండ్రులు అరికిళ్ల చేరాలు, భద్రమ్మ, జవాన్ సోదరుడు మాజీ సర్పంచ్ ప్రసాద్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు

# మండల కేంద్రంలో ఘనంగా డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు

## బీజేపీ మండల అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి



**ఆత్మకూర్ జులై 6 (జనం సాక్షి):** బిజెపి ఆత్మకూరు మండల కేంద్రంలో మండల అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఉప్పుగల్ల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక, ఆర్థిక జాతీయవాదమే పునాదిగా, సనాతన ధర్మ రక్షణే ధ్యేయంగా భారతీయ జనసంఘ్‌ను స్థాపించిన మార్గదర్శి, అఖండ భారతమే ఆదర్శంగా, ప్రజల సంఘటిత శక్తే సిద్ధాంతంగా పనిచేసిన కర్మశీలి "ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిశాన్ నహీ చలేగా" అనే నినాదంతో దేశ ఐక్యత కోసం తన ప్రాణాలు అర్పించిన ధైర్యశాలి, జీవితాంతం హైందవ సాంస్కృతిక వికాసం కోసమే కృషి చేసిన నిత్య చైతన్యశీలి అని అన్నారు. "ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు ఉండకూడదు అనే అచంచల సంకల్పంతో దేశ సమైక్యత కోసం జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత దేశభక్తుడు కాశ్మీర్ సంపూర్ణ విలీనానికి బీజం వేసిన దార్శనికుడు అదే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం 370 ఆర్టికల్ రద్దు ద్వారా వారి కళ నెరవేరింది.వారు స్వతంత్ర భారతదేశ తొలి పరిశ్రమల మంత్రిగా, జమ్మూ కాశ్మీర్ కు ప్రత్యేక హోదా వ్యతిరేకిస్తూ పోరాటం చేసిన ఆయన, 1953లో అనుమానాస్పద పరిస్థితుల్లో జైలు లో ప్రాణాలు కోల్పోయారు.డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ 'ఏక్ బిధాన్, ఏక్ నిషాన్, ఏక్ ప్రధాన్' అనే సూత్రంతో దేశానికి ఒకే చట్టం, ఒకే ప్రధాని, ఒకే జెండా ఉండాలని గళమెత్తారు. ఆయన ఆశయాలే నేటి భారతీయ జనతా పార్టీకి మార్గదర్శక శక్తిగా నిలుస్తున్నాయన్నారు. విద్యావేత్తగా, చిన్న వయసులో కలకత్తా యూనివర్సిటీ ఉపకులపతిగా భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకునిగా, అంతర్జాతీయంగా మయన్మార్, శ్రీలంక, కంబోడియా, నేపాల్‌లతో సంబంధాల బలోపేతానికి కృషి చేసిన విదేశాంగ విశ్లేషకునిగా, నూతన ఆసియాకు నూతన దిశ'నిచ్చిన ధీశాలిగా వారి పేరు నిలుస్తుందని అన్నారు. వారి ఆలోచనలు వారి స్ఫూర్తి నేటి యువతరనికి ఎంతో ఆదర్శనీయమైనవి, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశ ఐక్యత కోసం యువత పనిచేయాలని అన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ వీరి త్యాగాలను మరవం, వారి ఆశయాలను కొనసాగించడమే వారికీ మనం ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. సోమవారం జయంతి సందర్భంగా ఆ మహానుభావుని ఆశయాలను గుర్తు చేసుకుంటూ ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు గట్టు వేణు గౌడ్, మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం,మాజీ జెడ్పిటిసి టీంగిలికారీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బయ్య పైడి, కోశాధికారి జక్కుల మహేందర్, వంగాల బుచ్చిరెడ్డి, భయ్యా శ్రీనివాస్, కుక్కల కుమారస్వామి, సోషల్ మీడియా కన్వీనర్ బలబద్ర దినేష్, భయ్యా మాలగం, కుక్కల సదయ్య, గుండబోయిన రఘుపతి, రమేష్, శ్రీనివాస్, సాంబయ్య తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

# కవి డా. బి. వెంకట్‌కు జాతీయ అక్షరరత్న సాహితీ పురస్కారం



**నిర్మల్ టౌన్,జులై 6 (జనం సాక్షి):** నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి, సంస్కృత భాషా ప్రచార సమితి ఆదిలాబాద్--నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షుడు డా. బి. వెంకట్‌కు విజయవాడలో నిర్వహించిన అఖిల భారత ద్విశతాధిక కవిసమ్మేళనంలో జాతీయ అక్షరరత్న సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. శ్రీ శ్రీ కళావేదిక, సవ్యసాచి గ్రూప్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. సాంప్రదాయ పండిత టోపీ, శాలువా, పూలమాల, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించిందని డా. వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల నుంచి 300 మందికి పైగా కవులు, రచయితలు పాల్గొన్నారు.

# జర్నలిస్టు ను పరామర్శించిన సిపిఐ నాయకులు



**తాండూర్, జూలై 06(జనం సాక్షి )** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఆయిలి రాజేశం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయము తెలుసుకొని ఆయన స్వగ్రామమైన కొత్తపల్లి గ్రామాని వెళ్లి పరమశించి మనోధైర్యం ఇచ్చి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కొన్ని నిబంధనలు నియమాలు పాటించాలని సూచించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను వార్తల రూపంలో ప్రజలకు చేరవేస్తూ జర్నలిజం రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న ఆయన అనారోగ్యంతో బాధపడడం చాలా బాధాకరమని గతం లాగా ఆరోగ్యంగా జీవించాలని మళ్లీ జర్నలిస్టుగా కొనసాగాలని సిపిఐ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో కొండు బానే ష్ సిపిఐ తాండూర్ మండల కార్యదర్శి. నరాల ప్రహ్లాద్ సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి. కొండు సాయికుమార్ సిపిఐ చంద్ర పల్లి గ్రామ కార్యదర్శి వున్నారు.

# పెరకవాడ హై స్కూల్ పూర్వ విద్యార్థి హనీఫ్ మూడవ వర్ధంతి

- పేద విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టీల్ వస్తువుల బహూకరణ
- పెరిక వాడ హైస్కూల్లో కార్యక్రమం

**వరంగల్ ఈస్ట్, జూలై 06 (జనం సాక్షి)** వరంగల్ నగరంలోని పెరకవాడ హైస్కూల్లో పదో తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థి ఎండి. హనీఫ్ మూడో వర్ధంతి కార్యక్రమం సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి తండ్రి హస్సేన్ మాట్లాడుతూ 2022లో తన కుమారుడు హనీఫ్ రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు తెలిపాడు. అప్పటినుండి తన వర్ధంతి సందర్భంగా పాఠశాలలోని పేద విద్యార్థులకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్టీల్ వస్తువులతోపాటు పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు బడికి వచ్చేటప్పుడు రోడ్డు భద్రత పాటించాలని కోరాడు. పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు పి. సాంబమూర్తి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతూ అకాల మరణం పొందిన హనీఫ్ ఎంతో మంచి విద్యార్థి అని గుర్తు చేశాడు. హనీఫ్ మరణం దురదృష్టకరమని , ఆయన జ్ఞాపకార్థం ఆ కుటుంబ సభ్యులు పేద విద్యార్థులకు చేస్తున్న సేవ మరువలేనిదని అన్నాడు. ఈ



కార్యక్రమంలో ఎండి సమీనా, హారున్, హర్ష, పాఠశాల ఇన్చార్జి హెడ్మాస్టర్ శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల సోషల్ టీచర్ సాంబమూర్తి, వెంకటేశ్వర రెడ్డి, రవి, కల్పన, సృజన, చాంద్ పాషా, అంకుష్, ఆరిఫ్, జాకీర్, ఇబ్రహీం, సద్దాం హుస్సేన్, అస్గర్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# డీజీపీ ఆదేశాల అమలుపై ఎస్పీ సమీక్ష

## వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పోలీసు అధికారులకు దిశానిర్దేశం

**నిర్మల్ బ్యూరో ,జూలై 6, (జనంసాక్షి):** డీజీపీ సి.వి. ఆనంద్ జారీ చేసిన ఆదేశాల అమలు, కంప్లయన్స్‌పై జిల్లా పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా పోలీసు క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లాలో శాంతిభద్రతలు, పెండింగ్ కేసుల దర్యాప్తు, మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల సత్వర విచారణ, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిర్వహణ, విజిబుల్ పోలీసింగ్, పెండింగ్ వారెంట్ల అమలు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిఘా, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై చేపట్టిన చర్యలను సమీక్షించారు. డీజీపీ ఆదేశాలను జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో కచ్చితంగా అమలు చేయాలని, పెండింగ్ అంశాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి కంప్లయన్స్ నివేదికలు వెంటనే సమర్పించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత సమర్థవంతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని పెంపొందించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భైంసా అదనపు ఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, జిల్లాలోని సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

## మండల విద్యాశాఖ అధికారిని మానుపాటి పాపమ్మ

**చెన్నారావుపేట, జులై 6 ( జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని మండల విద్యాశాఖ అధికారిని మానుపాటి పాపమ్మ అన్నారు. సోమవారం చెన్నారావుపేట మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమావేశంను నిర్వహించారు.ఈ ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను అత్యధికంగా పెంచాలని అలాగే విద్యార్థుల హాజరు శాతంను పెంచాలని తెలిపారు.అలాగే ప్రతి రోజు ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నిజేషన్ యాప్ లో విధిగా చేయాలని తెలిపారు. నూతనంగా విద్యార్థులకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని తెలిపారు.అలాగే మధ్యాహ్న భోజనంను మెను ప్రకారం వడ్డించాలని పాఠశాలలో చేరే ప్రతి విద్యార్థి వివరాలను యూ డైస్ యాప్ లో విధిగా నమోదు చేయాలని తెలిపారు.పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల ఏపియం తిలక్ కుమార్, ప్రధానోపాధ్యాయులు జ్యోతి, తేజావత్ జయ, పెద్ది



వెంకటేశ్వరరావు, ఇంద్ర కర్ణాకర్ రెడ్డి, జయ ప్రకాష్, చందనాల హరి, నాగుల శ్రీనివాస్, పడిదం కట్టస్వామి, ఇల్ల సూరయ్య, బానోతు వెంకన్న, కుమారస్వామి, టీవీ సత్యనారాయణ, బొమ్మెర సతీష్, శ్రీనివాస్, రమేష్, రవి అశోక్, మాధురి, ఉమాదేవి, శౌరీలు, ఈర్య, పవన్ కుమార్, వెంకటేశ్వర్లు, భాస్కర్, సంధ్యారాణి, నిర్మల, ఎంఆర్సిసిబ్బంది అశోక్, స్వప్న, యాదగిరి, సీఆర్పీలు సంపత్, స్వామి, బాలు, శిల్ప, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ మండల విద్యాశాఖ అధికారిగా శ్రీమతి బి శ్రీదేవి బాధ్యతల స్వీకరణ



**ధర్మసాగర్ జులై 6;(జనం సాక్షి)** ధర్మసాగర్ మండల విద్యాశాఖ అధికారిగా జెడ్పీ హైస్కూల్ పెద్దపెండ్యాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి బి శ్రీదేవి ఈరోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నత ప్రాథమిక పాఠశాలలు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరై శ్రీమతి శ్రీదేవికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు నూతన బాధ్యతల్లో ఆమె సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శిస్తూ ధర్మసాగర్ మండల విద్యాభివృద్ధికి విశేష కృషి చేయాలని ప్రభుత్వ పాఠశాలల నాణ్యతను మరింత మెరుగుపరచాలని ఆకాంక్షిస్తూ ఆమెకు విజయవంతమైన పదవీకాలం కలగాలని అందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో నిర్వహించబడింది.

# ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలి

- పన్నాల ఎల్లారెడ్డి పిఎసిఎస్ చైర్మన్
- పిఎసిఎస్‌లో సహకార వారోత్సవాలు



**గోవిందరావుపేట. జులై.(జనం సాక్షి ). 06.07.26.** రైతులు ఆర్గానిక్ వ్యవసాయ ఆధునిక పద్ధతులను అవలంబించి వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులను సాధించాలని పిఎసిఎస్ చైర్మన్ పన్నాల ఎల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయంలో సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎల్లారెడ్డి. మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా పురాతన వ్యవసాయ పద్ధతులను విడిచిపెట్టి ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని అన్నారు. ప్రధానంగా ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమికి ఎలాంటి హాని ఉండదు. రైతాంగానికి కూడా ఎలాంటి ప్రాణహాని ఉండదు కాబట్టి ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను అవలంభించాలని సూచించారు. అందుకు తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్లు, సీఈవో తిరుపతి, రైతులు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వర్ డౌన్‌తో ఆగిన రిజిస్ట్రేషన్లు



**పాలకుర్తి. జూలై 06(జనంసాక్షి)** వారం రోజుల నుంచి భూభారతి పోర్టల్లో సాంకేతిక సమస్యలతో రిజిస్ట్రేషన్లు జాప్యం జరుగుతుంది. స్లాట్ కావడం కోసం కూడా జాప్యం ఏర్పడుతోంది. వారం రోజుల నుంచి సాంకేతిక పరంగా సమస్యలు రావడంతో స్లాట్ బుక్ చేసుకున్న వారు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఏమైంది అడిగితే ఒక్క పాలకుర్తి కాదని రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉందని అధికారులు చెబుతున్న సమాదానం. స్లాట్ బుక్ ఇంక ఎన్ని రోజులు ఈ తిప్పలు పడాలని రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించి సర్వర్ డౌన్ లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు.

# వైద్యం సకాలంలో అందించాలి :చైర్ పర్సన్ అంకం మౌనిక

**ఖానాపూర్ జూలై 06 (జనం సాక్షి)** నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వైద్యులు వైద్య సేవలు సకాలంలో అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ అంక మౌనిక మహేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులతో మాట్లాడి ఆసుపత్రి నిర్వహణ తీరుపై ఆరా తీశారు. మందులను పరిశీలించి, ఎక్స్రే, రక్త పరీక్ష యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రోగులకు అత్యవసరమైన రక్తపు పరీక్షలు చేసేందుకు సెల్ కౌంటింగ్ యంత్రం అందుబాటులో లేక పోవడం, ఎక్స్రే యంత్రం గత కొంతకాలంగా మరమ్మత్తులు చేయకపోవడం సరికాదని అన్నారు. స్థానికంగా ఉండే వైద్యులు సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు నివేదించి వెంటనే రోగులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వైద్యులతో పాటు సిబ్బంది సమయపాలన పాటించాలని అన్నారు. పరిసరాలను



పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ బొప్పారపు సత్యవతి, నాయకులు ఎనుగందుల నారాయణ, తదితరులు ఉన్నారు.

# అక్రమ ఇసుక రవాణా జరిగినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

- భూపాలపల్లి గడ్డ రక్షకుడు ఎమ్మెల్యే గండ్ర సత్తన్న
- మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్
- అక్రమ ఇసుక రవాణాకు కేరాఫ్ అడ్రస్ గండ్ర వెంకటరమణారెడ్డి

**టేకుమట్ల జులై 06 జనంసాక్షి** గత పది సంవత్సరాలు భూపాలపల్లి నియోజకవర్గాన్ని దోచుక తిన్నది బిఆర్ఎస్ పార్టీ నాయకులు. గండ్ర వెంకటరమణారెడ్డి కుటుంబం. బోర్నపల్లి వాగులో అక్రమ ఇసుక రవాణా జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అడ్డుకున్నట్టు వాళ్లు చేసుకుంటున్న ప్రచారం తప్పు. మండల కాంగ్రెస్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. కోటంచ గుడి నిర్మాణం కోసం అనుమతులతో ఇసుక తీసుకెళ్తా ఉంటే. అభివృద్ధిని చూసి ఓర్వలేక అడ్డుకొని రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూడడం దుర్మార్గం అని సతీష్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్. సర్పంచ్ లు. నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గండ్ర వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వెంకట్రావుపల్లి (బి). కాల్వపల్లిలో కమిషన్లకు కక్కుతి పడి ఇసుక క్వారీలు ఏర్పాటు చేసి ఈ ప్రాంతన్ని ఎడారిగా మార్చే ప్రయత్నం చేస్తే. అడ్డుకున్న నాయకుడు గండ్ర సత్తన్న. కాంగ్రెస్ పార్టీ నాయకులం అని ఈ సందర్భంగా గుర్తు చేసున్నం. అక్రమ ఇసుక రవాణా. అక్రమ పెట్రోల్. రవాణా అక్రమ కలప రవాణాకు కేరాఫ్ అడ్రస్ గండ్ర వెంకటరమణారెడ్డి అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోటగిరి సతీష్ గౌడ్ అన్నారు. ఈ



కార్యక్రమంలో సర్పంచులు పెరమండ్ల మొగిలి. నేరెళ్ల రామకృష్ణ. నాంపల్లి వీరేశం. తోట సాగర్. పొన్నం సాంబయ్య. అంబాల కిరణ్. కుర్రె మల్లయ్య. మాజీ వైస్ ఎంపీపీ సట్ల కొమురయ్య. మండల ప్రధాన కార్యదర్శి బండి రవీందర్. మాజీ సర్పంచులు చింతలపల్లి స్వామి రావు. అరకొండ రాజయ్య. గ్రామ శాఖ అధ్యక్షులు ఈసంపల్లి పోశాలు. డ్యాగర మల్లేష్. నాయకులు నేరేళ్ళ కుమార్. దేవేందర్. రాజేందర్. తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్‌లో సమర్పించిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలి: ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐటిడిఏ

**ఏటూరునాగారం, జులై 06(జనంసాక్షి).** సోమవారం సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో గిరిజనుల నుండి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించి సమస్యలను త్వరీతగతిన పరిష్కారం చూపాలని సంబంధిత సెక్టార్ అధికారులకి ఏటూరునాగారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి లెనిన్ వత్సల్ టోప్పో ఆదేశించారు. ఈ గిరిజన దర్బార్ లో వివిధ మండలాల నుండి వచ్చిన గిరిజనులు (6) దరఖాస్తులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇంచార్జ్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి మరియు డిప్యూటీ డైరెక్టర్ కి స్వయంగా గిరిజనులు సమర్పించారు. ఈ కార్యక్రమం లో ఏ అనిల్ కుమార్ డిప్యూటీ తహసిల్దార్ (ఎస్డీసి), కె వాని డిఎం జిసిసి, ఎం కొండల రావు జెడిఎం, ఏ కిషోర్ జియాలజిస్ట్, కె ప్రభాకర్ పేసా –



– కో ఆర్డినేటర్, ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రిన్సిపాల్ ఆర్ఐటిఐ, ఎల్ శంకర్ టిఎస్ ఆర్టీసి మేనేజర్ మరియు సంబందిత అధికారులు గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించిన సర్పంచ్ కాకులమర్రి శ్రీలత

**ఏటూరునాగారం, జూలై 06 (జనం సాక్షి).** ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, ఏటూరునాగారంలోని పలు పోలింగ్ బూత్‌లలో జరుగుతున్న ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియను మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లి పర్యవేక్షించారు. బూత్ స్థాయి నాయకులు, వార్డు సభ్యులు కార్యకర్తలతో కలిసి ఓటరు నమోదు దరఖాస్తులను, ఓటర్ల జాబితా క్లిప్ బోర్డులను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ



సందర్భంగా సర్పంచ్ శ్రీలత గారు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ కొత్త ఓటరుగా నమోదు చేయించాలని కోరారు. ఓటరు కార్డులలో తప్పుల సవరణ, మరణించిన వారి వివరాల తొలగింపు వంటి ప్రక్రియలను బిఎల్ఓ బి ఆల్ వో (బిఎల్ఓ)లతో కలిసి పారదర్శకంగా పూర్తి చేయాలని వార్డు సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి: ఎంఈఓ విజయ్ కుమార్

- పాఠశాలలను తనిఖీ చేసిన మండల విద్యాధికారి
- విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించాలని ఆదేశం

**కుభీర్, జులై 06, (జనంసాక్షి):** కుభీర్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి (ఎంఈఓ) విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలతో పాటు చోండి, గొడ్సరా, పాంగ్ర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందని గుర్తుచేశారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌తో పాటు మధ్యాహ్న భోజన వసతిని విజయవంతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు స్థానిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, బడిబయట ఉన్న పిల్లలను సైతం పాఠశాలల్లో చేర్పించేలా చొరవ చూపాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ విద్యను బోధించడంతో పాటు,



మధ్యాహ్నం మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

# ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్ లక్ష్యం

**తాండూర్, జూలై 06(జనం సాక్షి )** భారతదేశంలోని అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు కల్పించడమే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ డాక్టర్ పెద్ద బోయిన శంకర్ అన్నారు. తాండూర్ మండల కేంద్రంలో ఐబీ మార్కెట్ స్కూల్ దగ్గర బూత్ పరిధిలో సోమవారం రోజున నాయకులు సామాన్య ప్రజలకు ఎస్.ఐ.ఆర్.పైఅవగాహన కల్పించారు. అనంతరం సర్ ఫారాలను నింపి ఇచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్ పై ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని వారు సూచించారు. సర్ ప్రక్రియకు అందరు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ డాక్టర్ పెద్ద బోయిన శంకర్ . మండల వైస్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి శంకర్ గౌడ్ .మండల కోఆర్డినేటర్ మహమ్మద్ గౌస్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాత నాగరాజు .తాండూర్ మండల సోషల్ మీడియా కో ఆర్డినటర్ దుర్గం



మహేందర్, 13 వార్డ్ మెంబర్ జిదుల రేవతి .కొత్తపల్లి వార్డ్ మెంబర్ జంబోజుల ప్రవీణ్ . మైనారిటీస్ నాయకులు ఎండి ఆసిఫ్ హుస్సేన్ జీదుల వేణు, బిఎల్ఓలు షబానా, స్వరూప, లీలారాణి, జిపిఓ సుధాకర్ , బిఎల్ఎ రవి .మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సమస్యలను పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి.

**ములుగు ప్రతినిధి, జులై 06(జనంసాక్షి).** ప్రజావాణి కార్యక్రమంలో అర్జిదారులు సమర్పించిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, వాటిలో పేర్కొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 96 దరఖాస్తులు అందగా, వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 38, పెన్షన్లకు 11, భూ సమస్యలకు సంబంధించి 21, ఇతర శాఖలకు సంబంధించినవి 26 దరఖాస్తులు ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించడం



జరిగిందని తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తుకు అధికారులు ప్రాధాన్యతనిస్తూ, నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, డిఆర్ఓ రవికుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

# పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజ

**చెన్నారావుపేట, జూలై 6 ( జనం సాక్షి):** పెంపుడు జంతువులతో పాటు మానవులతో కలసి జీవించే జంతువులతో అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సరోజ అన్నారు. సోమవారం ప్రపంచ జూనోసిస్ డే ( పెంపుడు జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులు ) సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనం ఇంటిలో పెంచుకొనే కుక్కలు కరువటం వలన రేబిస్, గొర్రెలు, మేకలతో అంత్రాక్స్, ఆవులు, గేదెలతో క్షయ, ఎలుకలతో ప్లేగు, కోళ్లతో బర్డ్ ఫ్లూతో పాటు ఇతర జంతువులతో 200 రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. వ్యాధులు సోకిన కోళ్లు, గొర్రెలు, ఇతర జంతువులు, పశువుల మాంసం, తింటే వ్యాధి తీవ్రత ఇంకా ఎక్కువగా




ఉంటుందన్నారు. జంతువులు కరిచిన, గోకిన, నోటి నుండి వచ్చిన ద్రవాలు తాకిన వెంటనే సబ్బుతో శుభ్ర పర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ భద్రయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ జేతురాం, హెల్త్ సూపర్ వైజర్లు కీర్య, సువార్త, హెల్త్ అసిస్టెంట్లు సురేందర్, సార్య నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ మహోత్సవం



**కాటారం జులై 6( జనం సాక్షి ):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో జీవించాలని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని ప్రార్థించారు. అనంతరం రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఆడపడుచులకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి ,భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ధన్వాడ మాజీ సర్పంచ్ కరెంగుల తిరుపతి గౌడ్, గౌడసంఘం నాయకులు, మహిళలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పిఆర్టిటిఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం




**తాండూర్, జూలై 06(జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా : తాండూరు మండలంలో పిఆర్టిటిఎస్ 2026 సభ్యత్వ నమోదు కార్యక్రమం తాండూర్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చే మోహన్ రావు మాట్లాడుతూ పి ఆర్ సి నీ వెంటనే ప్రకటించాలని ఇప్పటికే చాలా ఆలస్యమైంది , అదేవిధంగా ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజనం మరియు అల్పాహారం స్కీముని విరమించుకోవాలని ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని మాకు ఎటువంటి అల్పాహారం గాని మధ్యాహ్న భోజనంగాని అవసరం లేదని తెలియజేయడం జరిగింది ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీ శేషగిరిరావు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీ అజీమర్తిన్ మండల అధ్యక్షుడు ఆనంద్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్రీకాంత్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# నైట్ వాచ్ ఉమెన్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**కాసిపేట జూలై 6 ( జనం సాక్షి )** కాసిపేట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో, నైట్ వాచ్ ఉమెన్ (కాంట్రాక్టు)పోస్టుకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు,మండల విద్యాధికారి ముక్తవరం వెంకటేశ్వర స్వామి తెలిపారు. స్థానిక మహిళా అభ్యర్థులు ఈనెల 7వ తేదీ నుండి 9వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు, మండల విద్యా వనరుల కేంద్రం నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని వయస్సు 18 నుండి 45 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫామ్ కు పదవ తరగతి మెమో, ఒకటవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డును జత పరచాలని సూచించారు

# 100 శాతం సబ్సిడీతో కూరగాయల విత్తనాల పంపిణీ



**నెన్నెల, జులై 6: (జనం సాక్షి )** బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ఆదేశాల మేరకు సోమవారం నెన్నెల మండలం మన్నెగూడెం గ్రామంలో రైతులకు 100 శాతం సబ్సిడీతో ఐదు రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఏఎంసీ డైరెక్టర్ శ్రీమతి గోలేటి సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించబడింది. రైతులు కూరగాయల సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ అరుణ్, హెచ్ఈఓ కుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

# కొయ్యూరులో ఉచిత వైద్య శిబిరం

## డాక్టర్ వినయ్ భాస్కర్



**మల్హార్,జులై06(జనంసాక్షి)** మండలంలోని కొయ్యూరు గ్రామంలో సోమవారం రోజున ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చెయ్యడం జరింగింది. ఇందులో భాగంగా ఈ వైద్య శిబిరంలో ఈ రోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తాడిచర్ల నుండి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కొయ్యూరు గ్రామంలో మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది.ఈ మెడికల్ క్యాంప్ లో ఈ 76 మంది పేషంట్లకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. బీపీ,షుగరు,డెంగ్యూ,మలేరియా సంబంధిత టెస్టులు చెసి వారికి కావలసిన మందులు ఇవ్వడం జరిగింది. వర్షా కాలం సీజన్ లో పాటించాల్సిన సీజనల్ వ్యాధుల గురించి తెలియజేయడం జరిగింది.కొయ్యూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ సంగీత సిబ్బంది కి మరియు విద్యార్థులకు తెలియజేశారు.ఈ క్యాంపులో తాడిచర్ల ప్రాథమిక వైద్య అధికారి డాక్టర్ వినయ్ భాస్కర్,డాక్టర్ సంగీత, హెల్త్ సూపెర్వైజర్, గ్రామ సర్పంచ్కొండా రాజమ్మ,పంచాయతీ సెక్రటరీ, హెల్త్ అసిస్టెన్స్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చేయూత..



**చెన్నారావుపేట, జూలై 6 ( జనం సాక్షి):** ముఖ్యమంత్రి సహాయ నిధి అత్యవసర సమయంలో పేదలకు ఎంతో అండగా నిలుస్తుందని పాత మగ్దంపురం గ్రామ సర్పంచ్ ననుమాస కరుణాకర్ అన్నారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మండల పరిధిలోని పాత మగ్ధంపురం గ్రామానికి చెందిన కల్వచర్ల ఉమాకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 16 వేలు మంజూరయ్యాయి.సీఎం రిలీఫ ఫండ్ చెక్కును సర్పంచ్ ననుమాస కరుణాకర్ ఆధ్వర్యంలో నర్సంపేట మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు అల్వాల శ్రీనివాస్, చెన్నారావుపేట సొసైటీ డైరెక్టర్ ననుమాస వీరస్వామిలతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ధోనికల భార్గవ్, షేక్ హసీనా, యువ నాయకులు మాదాసి రమేష్, సుంకరి రాజు, మేకల దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా పచ్చదనం లక్ష్యంగా ఉచిత మొక్కల పంపిణీ



**ఉట్నూర్ జులై 06 (జనం సాక్షి):** ప్రతిఒక్కరు మొక్కలు నాటే వాటిని సంరక్షించాలని ఉట్నూర్ మండలం లోని లింగోజి తాండ ఎక్స్‌రోడ్ గ్రామపంచాయతీ సర్పంచ్ మాయ-హరినాయక్ అన్నారు. సోమవారం రోజున స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు గ్రామంలోని ప్రతి వీధిలో పూల మొక్కలు,పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ మాయ హరినాయక్ ప్రారంభించి స్వయంగా గ్రామస్తులకు మొక్కలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఇంటి ఆవరణలో కనీసం ఒక పూల మొక్క, ఒక పండ్ల మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. పచ్చదనం పెంపొందించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం, భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మొక్కలు కావాల్సిన గ్రామస్థులు గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి ఉచితంగా తీసుకెళ్లాలని సర్పంచ్ మాయ హరినాయక్ విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని మొక్కలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిపి వర్కర్లు సురేష్ నవీన్ గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గున్నారు.

# మక్కల కొనుగోలులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి
- యూరియా యాప్ రద్దు చేయాలి
- నియోజకవర్గంలో ఎమ్మెల్యే బామ్మర్దుల రాజ్యమేలుతుంది.



**చిట్యాల, జులై 06(జనం సాక్షి ):** మక్కల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపించి, రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో సోమవారం బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మక్కలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సొంతంగా హమాలీ, రవాణా తదితర ఖర్చులు భరించినప్పటికీ, గోదాంలలో స్థలం లేదని చెప్పి ఒక చోటు నుంచి మరో చోటుకు తిప్పి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా, రైతులకు చెల్లించాల్సిన బిల్లుల్లో అక్రమంగా కోతలు విధించి ఒక్కో రైతుకు సుమారు రూ.10 వేల వరకు నష్టం కలిగించారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు రావాల్సిన మొత్తాన్ని పూర్తి స్థాయిలో చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అదేవిధంగా యూరియా పంపిణీలో అమలు చేస్తున్న యాప్ విధానం వల్ల సెల్‌ఫోన్ వినియోగం తెలియని, సాంకేతిక పరిజ్ఞానం లేని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి, గతంలో అమలులో ఉన్న సులభమైన విధానంలోనే యూరియా పంపిణీ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలో సీఎం అన్నదమ్ముల రాజ్యం నడుస్తుంటే, భూపాలపల్లి నియోజకవర్గం లో ఎమ్మెల్యే బామ్మర్దుల రాజ్యం కొనసాగుతోందని విమర్శించారు.రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రైతుల హక్కులను కాపాడేందుకు బిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గొర్రె సాగర్, కుంభం కాంత్ కుమార్, అల్లం రవీందర్, పిట్ట సురేష్, తౌటం నవీన్, వేముల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# సీత కుంట భూములుసర్వే చేయించి హద్దులు పెట్టిన తాసిల్దార్‌కు కృతజ్ఞతలు

## -శాయంపేట గ్రామ ఉప సర్పంచ్ ధైనంపల్లి సుమన్



**శాయంపేట, జులై 6 (జనం సాక్షి)** శాయంపేట గ్రామానికి చెందిన సీతకుంట భూములు సర్వే చేయించి హద్దులు పెట్టిన తాసిల్దార్ కు శాయంపేట ఉపసర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. సీత కుంట భూమి ప్రజల ఆస్తి అని గ్రామ ఉపసర్పంచ్ డైనంపెల్లి సుమన్ అన్నారు. ఈ భూములను ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోం అని అన్నారు. ప్రభుత్వ భూములను రక్షించడానికి ఎంత దూరమైనా వెళ్తామణి చెప్పారు. అక్రమార్కులు కొందరు ఇట్టి భూములను ఫేక్ డాక్యుమెంట్ల ఆధారంగా ఆక్రమించుకోవడానికి ప్రయత్నించడాన్ని ఆయన తప్పు పట్టారు. తన ఫిర్యాదుతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం సర్వేలో నిజా నిజాలు ఏంటో బయటపడ్డాయనీ వివరించారు. రెవెన్యూ, ల్యాండ్ సర్వే ఆఫీసర్లు జరిపిన సర్వేలో 8 గుంటల ప్రభుత్వ భూములు తేలడం చారిత్రాత్మక నిర్ణయం అని చెప్పారు. సోమవారం ఆయన శాయంపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. శాయంపేట గ్రామ ఉప సర్పంచ్ గా తనను రెండో సారి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి ఈ సంఘటన నాకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. నా చిన్నతనం లో సీత కుంట భూములను సర్కారు అవసరాలకు ఉపయోగించారని తెలిపారు. ఇందులోనే తాసిల్దార్ ఆఫీస్, ఎంపీడీవో ఆఫీస్, పోలీస్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్ నిర్మాణం జరిగిందన్నారు. ఇవి నిర్మించగా ఇంకా సీతకుంట మిగులు భూములు అలాగే ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఈ కాళీ జాగలపై కన్నేసిన మైలారంకు చెందిన ఓ వ్యక్తి తప్పుడు పత్రాల సహాయంతో ప్రజల ఆస్తిని కాజేయడానికి ప్రయత్నించారని పేర్కొన్నారు. దీనిపై తాను ఒంటరిగానే పోరాటం చేయవలసి వచ్చింది అన్నారు. సుమారు కోటి రూపాయల విలువ గల ప్రజల ఆస్తిని కాపాడగలిగానని.. ఇది ప్రజల ఆశీర్వాదంతోనే జరిగిందన్నారు. పేరు పలుకుబడి కలిగిన లీడర్ ప్రజల ఆస్తిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే చట్టపరంగా తాను పోరాటం చేశానని వివరించారు. ఈ సంఘటనతో ప్రభుత్వ చట్టాలు ఎవరికి చుట్టాలు కావని మరోసారి నిరూపితం అయిందన్నారు. ప్రభుత్వ ఆస్తుల జోలికి వస్తే తాము ఊరుకునేది లేదని మరోసారి స్పష్టం చేశారు. ప్రభుత్వపరంగా రెవెన్యూ ల్యాండ్ సర్వే అధికారులే ఫీల్డ్ సర్వే చేసి హద్దులు పెట్టారని వీటిని శాయంపేట గ్రామ ప్రజల ఉమ్మడి అవసరాల కోసం ప్రభుత్వం ఉపయోగిస్తుందని చెప్పారు. ఈ పోరాటంలో తనకు సహకరించిన తోటి వార్డు సభ్యులకు, మీడియా మిత్రులకు, గ్రామ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన మరమ్మత్ పనులను తక్షణమే చేపట్టాలి



**నల్లబెల్లి, జూలై 06 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన మరమ్మత్ పనులను తక్షణమే చేపట్టాలని సిపిఐ మండల కమిటీ పేర్కొన్నారు. ఈ మేరకే సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం రాత్రి స్లాబు పై పెచ్చులు ఊడిపడడంతో 108 సిబ్బందికి తృట్టిలో ప్రమాదం తప్పిందన్నారు. ప్రమాదకరంగా పెచ్చులు ఊడుతున్న భవనాన్ని వెంటనే మరమ్మత్ పనులు చేపట్టకుంటే భారీ వర్షాలకు మరిన్ని పెచ్చులు ఊడి సిబ్బందిపై పడే ప్రమాదం ఉందని తెలిపారు. మరమ్మత్ పనులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు.వర్షాకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణ బురద మయంగా మారి రోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయని అందుకు సిసి వెయ్యాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు బట్టు సాంబయ్య, పరికి కోర్నెల్, కడియాల క్రాంతి కుమార్, మామిళ్ళ పెద్ద ఐలయ్య, సిపిఐ(యు) నాయకులు దామ సాంబయ్య, మార్త నాగరాజు పాల్గొన్నారు.

# 10న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలి

- **యూనివర్సిటీ పరిపాలన భవనం ముందు బంద్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ**



హనుమకొండ ప్రతినిధి జూలై 6 (జనం సాక్షి) :ఈ నెల జూలై 10వ తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్య సంస్థల బందు ను జయ ప్రదం చేయాలని, ఎస్ఎఫ్ఐ హనుమ కొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ ,పిడిఎస్యు జిల్లా కార్యదర్శి నరసింహారావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్య క్షులు భాను, ప్రసాద్ ఏఐడీఎస్ఓ, జిల్లా బాధ్యులు వెంకటేష్ ఏ ఐ ఎస్ బీ జిల్లా బాధ్యులు మిస్బా, పి డి ఎస్ యు జిల్లా బాధ్యులు రాంబాబు, అన్నారు సోమవారం కాకతీయ యూనివర్సిటీలో ని పరిపాల భవనం ముందు విద్య సంస్థల బంధు వాల్ పోస్టర్స్ ను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ విద్య రంగాన్ని నాశనం చేస్తుందన్నారు తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల కు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ ప్రభుత్వ విద్య రంగాన్ని నాశనం చేసే విధంగా పరిపాలన చేస్తుంద న్నారు తెలంగాణ రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశా లలను నాలుగు వేలకు కుదించే కుట్రలో ప్రభుత్వం ఉందన్నారు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాల నర గడుస్తున్న కూడా ఇప్పటివరకు విద్య శాఖ మంత్రి లేరు అన్నారు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు యూనిఫామ్స్ అందలేదన్నారు ప్రైవేట్ కార్పొరేటు విద్యా వ్యాపారాన్ని అరికట్టి ఫీజుల నియంత్ర చట్టం తీసుకురావాలన్నారు తెలంగాణ రాష్ట్రంలో విద్యా హక్కు చట్టం అమలు చేసి పేద విద్యార్థులకు 25% ఉచిత విద్య ప్రవేశాలు కల్పించాలి అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగ నికి ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేసి ఐదు లక్షల విద్య భరోసా కార్డులు ఉచిత లాప్టాప్ అందిం చాలన్నారు ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థల్లో విచ్చల విడిగా తెరిచి పాఠ్య పుస్తకాలు యూనిఫాంసు నోట్ బుక్స్ కేంద్రాలను వెంటనే మూసివేయాలీ అ న్నారు. జూలై 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టే తెలంగాణ రాష్ట్ర విద్యా సంస్థల బందును విద్యార్థులు మేధావులు కవులు రచ యితలు విద్య సంస్థలు అందరూ మద్దతు తెలిపీ బందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయ కులు చెన్నూరి సాయికుమార్ బొచ్చు కళ్యాణ్ జస్వంత్ తాజుద్దీన్ జలీల్ నాగరాజ్ అరుణ్ పాల్గొన్నారు.

## నీళ్లు నింపని చాతగాని ప్రభుత్వం

గంటల వరకే నడిపించాలని, కానీ రేయిబవళ్లు ఎందుకు నడుపుతున్నారన్నారు. మా ఉద్యమకారుడు రామకృష్ణ ఇసుక లారీల వద్ద దుర్మరణం చెందారని, ఇలాంటి ఘోరాలు ఇంకా ఎన్ని చూడాలని ప్రశ్నించారు. మంత్రి సీతక్క ఎందుకు సాయంత్రం 6 గంటల తర్వాత ఇసుక రవాణా ఎందుకు అడ్డుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో తాటీ కృష్ణ, తుమ్మ మల్లారెడ్డి, వలిబాబా, కాకులమర్రి ప్రదీప్‌రావు, కునూరు అశోక్ గౌడ్, కొమరం ధనలక్ష్మీ, బాడిష నాగ రమేష్, సిద్ధంశెట్టి లక్ష్మణరావు, ఎండి కుర్బాన్ అలి, తాడురి రఘు, పప్పు వెంకట్ రెడ్డి, శ్రీనివాసచారి, కాళ్ల రామకృష్ణ, గండేపల్లి నర్సయ్య, మూగల రమేష్, యలవర్తి శ్రీనివాసరావు, జాడి భోజరాజు, కుమ్మరి చంద్రబాబు, వావిలాల ముత్తయ్య, పుల్లారావు, ఎర్రంశెట్టి రామకృష్ణ, మండల సంతోష్, మునగాల మహేష్, మునగల నరేష్, భాడిష నవీన్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

గోవింద్ లాల్ తమ పట్టా భూమి కిస్తాలీ విరాళముగా పోయినందున నష్టపరిహారం ఇప్పించాలని దరఖాస్తు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు..

## జిల్లా కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, తహసీల్దార్ విజయభాస్కర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్, హోమ్ వర్క్ డైరిల పంపిణీ




**వరంగల్ ఎంజీఎం, జూలై 6(జనంసాక్షి):** రోటరీ వరంగల్ క్లబ్ లో సీనీయర్ రోటరీయన్ ఎల్లెంకి రాజయ్య ఎల్ బి నగర్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మాసూమ్ అలి విధ్యార్థులకు స్కూల్ అండ్ హోమ్ వర్క్ డైరిలను అందచేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుమ్మ జయబాలరెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ చేస్తున్న సేవలను అభినందిస్తు స్పాన్సర్ చేసిన రోటరీయన్ రాజయ్య కు ధన్య వాదములు తెలియ చేశారు.ఇంకా ఈ కార్య క్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కావటి కనకయ్య,కలువల కమలాకర్ రావు,ఆడేపు బిక్షపతి ,ఠంయ్యాల శ్రీధరాచార్యులు,సాయ బోయిన మోహాన్,ఆర్.భాస్కర్ ,ట్రైయినీ టీచర్లు విధ్యార్థినీ విధ్యార్థులు పాల్గోన్నారు.

## మహదేవపూర్‌లో గ్రంథాలయ నిర్మాణానికి స్థలపరిశీలన

- **జిల్లా గ్రంథాలయ సమస్థ చైర్మన్ కోట రాజబాపు**



**మహదేవపూర్, జూలై 6 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు మహదేవపూర్ మండల కేంద్రంలో గ్రంథాలయ నిర్మాణానికి జిల్లా గ్రంథాలయ సమస్థ చైర్మన్ కోటరాజబాపు సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలన చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాల య చైర్మన్ కోట రాజబాబు మాట్లాడుతూ. గ్రంథాలయం అనేది కేవలం పుస్తకాలు ఉండే భవనం మాత్రమే కాదని అది ఒక గ్రామ భవిష్యత్తును తీర్చిదిద్దే గాన కేంద్రం ప్రతి గ్రామంలో గ్రంథాలయము ఉంటే ఆ గ్రామంలోని విద్యార్థులు, యువత, విశ్రాంతి ఉద్యోగు లకు, మంచి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. అలాగే నేటి కాలంలో యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లో గడపకుండా పుస్తక పఠనంపై దృష్టి పెట్టాలని గ్రంథాలయాలు యువతను చెడు వ్యసనాలు అలవాట్లు నుంచి దూరం చేసి మంచి విజ్ఞానం క్రమశిక్షణ వ్యక్తిత్వ వికాసం వైపు నడిపిస్తాయని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నారు. మహదేవపూర్ లో నిర్మించనున్న గ్రంథాలయం ద్వారా విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులు, ఉద్యోగస్తులు, గ్రామ ప్రజలు ఒకే చోట విలువైన పుస్తకాలు దినపత్రికలు, విజ్ఞాన, సాహిత్యం , చదివే అవకాశం పొందుతారని తెలిపారు, ప్రతి విద్యార్థి రోజు కొంత సమయం గ్రంథాలయంలో గడిపి పుస్తకాలను తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా గ్రంథాలయం ఏర్పడడం ద్వారా గ్రామంలో చదివే సాంస్కృతి మరింత పెరిగి భావితరాలకు శాశ్వత జ్ఞాన సంపద అందుబాటులోకి వస్తుందని మహదేవపూర్ చౌరస్తాలో ఏర్పాటు కానున్న గ్రంథాలయంగ్రామ ప్రజలకు జ్ఞాన దీపంలా వెలుగునిస్తూ విద్యారంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ సత్యనారాయణ స్వామి. ఆర్ఐ జగన్మోహన్ రెడ్డి. స్థానిక సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్, మాజీ ఎంపీపీ రాణిబాయి. బ్లాక్ కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు అస్రార్ ఖురేష్.మాజీ దేవస్థానం చైర్మన్ .వామన్ రావు. కాటారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇర్షాద్ సీనియర్ నాయకులు అయిత తిరుపతిరెడ్డి. యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండి నహీమ్ హరీష్ ఎండి సాహిన్. పంచాయతీ కార్యదర్శి కల్పన. వార్డు సభ్యులు. పాల్గొన్నారు.

## కోల్ మైన్స్ ఆఫీసర్స్ ధర్నాకు సంపూర్ణ మద్దతు

- **బీసీఎస్సీ జేఏసీ, తెలంగాణ విద్యావంతుల వేదిక**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో. (జనంసాక్షి):** కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ధర్నాకు మా సంపూర్ణ మద్దతు అని బీసీఎస్సీ జేఏసీ, తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న బొగ్గు గనుల వేలం విధానానికి వ్యతిరేకంగా, సింగరేణి ఉద్యోగుల హక్కుల సాధన కోసం కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా బీసీఎస్సీ జేఏసీ జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ రాదండి దేవేందర్ మాట్లాడుతూ సింగరేణి అధికారులు, ఉద్యోగుల డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవని తెలిపారు. వెంటనే జీతాల ఎక్స్‌గ్రేషియా పెంపు అమలు చేయాలని, పీఆర్‌పీ పెంచి చెల్లించాలని, పారదర్శక ప్రమోషన్ పాలసీ అమలు చేయాలని, సింగరేణికి రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సింగరేణి దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన ప్రభుత్వ రంగ సంస్థ అని, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి అన్ని ప్రజాస్వామ్య శక్తులు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కో కన్వీనర్ జోగుల సమ్మయ్య, కొత్తూరి రవీందర్, జిల్లా నాయకులు శిలపాక హరీష్, మేకల ఓంకార్, రేణుకుంట్ల మహేష్, పక్కల రాజేందర్ పాల్గొన్నారు.

## సర్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**జయశంకర్ భూపాల పల్లి బ్యూరో. (జనంసాక్షి):** సర్ విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి అని భూపాలపల్లి మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యులు మొహమ్మద్ ఇర్ఫాన్ అన్నారు. భూపాలపల్లిలో జరుగుతున్న సర్ కార్యక్రమంపై సోమవారం ప్రచారం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా గత నెల 25 నుండి ఈ నెల 24 వరకు దేశంలో నకిలీ, బోగస్, డబుల్, డెత్, శాశ్వతంగా మారిన ఓటర్లను గుర్తించి తొలగించేందుకు, ఓటు హక్కుతో భారత రాజ్యాంగ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తి కాగా, తెలంగాణ రాష్ట్రంలో బూతు స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల బూతు స్థాయి ఏజెంట్లను నియమించారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు దక్కేలా బూతు స్థాయి అధికారులను ఇంటింటికి పంపుతున్నారని వివరించారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరికీ దక్కేలా ఓటరు సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. సర్వేలో ప్రజలందరూ బాధ్యతాయుతంగా పాల్గొని, సకాలంలో తమ ఓటు నమోదు చేసుకొని బూతు స్థాయి అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బూతు స్థాయి అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో 13వ రోజు నల్ల బ్యాడ్జీలతో నిరసన



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో. (జనంసాక్షి):** యాదాద్రి ఉష్ణ విద్యుత్ కేంద్రంలో బొగ్గు నిర్వహణ విభాగం, బూడిద నిర్వహణ విభాగం నిర్వహణను ప్రైవేటీకరించే టెండరును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేటీపీపీలో టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో సోమవారం 13వ రోజు కూడా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రధాన గేటు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీపీఈజేఏసీ నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ప్రైవేటీకరించే చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. వైటీపీఎస్ ఉద్యోగుల న్యాయమైన ఉద్యమానికి సంఘీభావం తెలిపేందుకు జూలై 7న “చలో వైటీపీఎస్” కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వైటీపీఎస్ ప్రైవేటీకరణ టెండరును ప్రభుత్వం తక్షణమే రద్దు చేసి, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణతో పాటు ఉద్యోగుల హక్కులను కాపాడాలని టీజీపీఈజేఏసీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించింది.

# నిర్దేశిత పన్ను వసూళ్ల లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలి

- రెవెన్యూ అధికారుల పనితీరుపై బల్దియా కమిషనర్ టి. వెంకన్న సమీక్ష
- నిర్లక్ష్యంపై కఠిన చర్యల హెచ్చరిక



**వరంగల్ ఎంజీఎం, జూలై 6(జనంసాక్షి):** నిర్దేశిత పన్ను వసూళ్ల లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా తప్పనిసరిగా సాధించాలని జిడబ్లుఎంసి కమిషనర్ టి. వెంకన్న అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్ను వసూళ్ల పురోగతిపై సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సర్కిళ్ల వారీగా పన్ను వసూళ్ల స్థితిగతులు, ముందస్తు పన్ను చెల్లింపుపై ఐదు శాతం రాయితీ పథకం అమలు, రెవెన్యూ అధికారుల పనితీరును సమీక్షించిన కమిషనర్, ఆశించిన స్థాయిలో పురోగతి నమోదు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వసూళ్లు మందగించడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకుని, వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.సమావేశంలో కాశీబుగ్గ ఉప కలెక్టర్ ప్రసన్నరాణి ముందస్తు పన్ను చెల్లింపు పథకం కింద ఇప్పటివరకు సాధించిన వసూళ్లు గురించి వివరించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రతి నెల తొలి వారంలో పన్ను వసూళ్ల పురోగతిని సమీక్షిస్తామని తెలిపారు. నగరంలోని ప్రతి ఆస్తికి సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు కావాలని, ఒక్క ఆస్తి కూడా పన్ను పరిధికి వెలుపల ఉండకూడదని స్పష్టం చేశారు. పన్ను పరిధిలో లేని ప్రతి ఆస్తిని గుర్తించి వెంటనే నమోదు చేయడంతో పాటు, అవసరమైన చోట పన్ను నిర్ధారణను సవరించాలని ఆదేశించారు. ప్రతి రెవెన్యూ అధికారి, బిల్లు వసూలుదారు తమ పరిధిలోని నివాస, వాణిజ్య భవనాలు, పన్ను నిర్ధారణలు, కొత్తగా నమోదు చేయాల్సిన ఆస్తుల వివరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను వసూళ్లపైనా ప్రత్యేక దృష్టి సారించి, నగర ఆదాయం పెరిగేలా కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.పన్ను వసూళు ,, పన్ను నిర్ధారణలు, దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని కమిషనర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, పన్నుల అధికారి రామకృష్ణ, కాశీబుగ్గ ఉప కలెక్టర్ ప్రసన్నరాణి, సమ్మయ్య, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు వసూలు దారులు తదితరులు పాల్గొన్నారు.



## 8 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

- కాటారం సర్పంచ్ పంతకాని సడవలి

**కాటారం జులై 6( జనం సాక్షి ):** కాటారం గ్రామపంచాయతీ 10వ వార్డులో ఎర్రగుంటపల్లి నుంచి ఇప్పలగూడెం వెళ్లే రహదారిపై రూ.8 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాటారం గ్రామ సర్పంచ్ పంతకాని సడవలి సోమవారం శంకుస్థాపన చేశారు. వర్షాకాలంలో ఈ రహదారి బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొండ గొర్ల బానయ్య, వార్డు సభ్యులు మానేం రాజబాబు, కొండ రాజమల్లు, పసుల మొగిలి, అక్కపాక మల్లయ్య, మాజీ వార్డు సభ్యుడు కోటి శ్రీహరి, గ్రామ పెద్దలు గౌరోజ్ రోశయ్య, గోనె రవీందర్, గుర్రాల నరసింహులు, పైడాకుల మహేందర్, పెనుగొండ కిషోర్, బజారు రాజమల్లు, చింత పోచయ్య, ఉప్పు పోచయ్య, జక్కు వెంకటి పాల్గొన్నారు.

## పాలకుర్తిలో డాక్టర్ శ్యామా ముఖర్జీ జయంతి వేడుకలు

**పాలకుర్తి, జూలై 06(జనంసాక్షి)** డాక్టర్ శ్యామా ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకొని భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో పాలకుర్తి, తిర్మలగిరి గ్రామాల్లో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు మారం రవికుమార్ మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే రాజ్యాంగం అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప రాజనీతిజ్ఞుడని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మగాని శ్రీకాంత్, దుంపల సంపత్, ఈర్ల రాజు, వేల్పుల దేవరాజ్, పబ్బ సంతోష్, దేవసాని కృపాకర్, ఐలేని రామారావు. పెనుగొండ సోమేశ్వర్. తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యం

- ప్రహరీ గోడ నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



**వరంగల్ ఎంజీఎం, జూలై 6(జనంసాక్షి):** ప్రహరీ గోడ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిడబ్లుఎంసి కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మడికొండలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం, కళాశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో వీధి కుక్కలు, పందులు ఆవరణలోకి ప్రవేశిస్తూ విద్యార్థినుల భద్రత, పరిశుభ్రతకు ఇబ్బందులు కలుగుతున్నాయని, సమస్యలను వసతి గృహ ప్రిన్సిపాల్ జ్యోతి జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న దృష్టికి తీసుకురావడంతో, కమిషనర్ సోమవారం క్షేత్రస్థాయిలో వసతి గృహాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు.వసతి గృహం, కళాశాల ఆవరణను ప్రత్యక్షంగా పరిశీలించిన కమిషనర్, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. శాశ్వత పరిష్కారంగా ప్రహరీ గోడ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని సూచించారు.అలాగే వసతి గృహ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని, ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, మురుగునీటి పారుదల వ్యవస్థను సక్రమంగా నిర్వహించి డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.విద్యార్థినులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్న కమిషనర్, సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. రాజారెడ్డి, పశువైద్య అధికారి డా. గోపాల్‌రావు, ప్రిన్సిపాల్ జ్యోతి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి ఎన్ఐటీ మరో ముందడుగు

**కాజీపేట, జూలై 6 (జనం సాక్షి) :** విద్యార్థుల సమగ్రాభివృద్ధి, మానసిక ఆరోగ్యం, సానుకూల క్యాంపస్ సంస్కృతి పెంపొందించాలనే లక్ష్యంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్లోని సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ ఆధ్వర్యంలో "విద్యార్థుల మానసిక శ్రేయస్సు, మెంటరింగ్ మరియు సానుకూల క్యాంపస్ సంస్కృతి అంశంపై రెండు రోజుల అధ్యాపకుల సామర్థ్యాభివృద్ధి కార్యక్రమం సోమవారం అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది. సెంటర్ ఫర్ మెంటల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ చైర్మన్ ప్రొఫెసర్ జి. అంబా ప్రసాద్ రావు విద్యార్థులకు మెరుగైన మెంటరింగ్ అందించేందుకు అధ్యాపకులు మరింత సున్నితంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని వివరించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ కె. కిరణ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల శ్రేయస్సు విద్యా ప్రగతికి పునాది అని, ప్రతి అధ్యాపకుడు విద్యార్థులకు మార్గదర్శిగా, నమ్మకమైన సహాయకుడిగా ఉండాలని పేర్కొన్నారు. ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ప్రారంభోపన్యాసంలో మాట్లాడుతూ, ఒక విద్యా సంస్థ గొప్పదనం కేవలం విద్యా ప్రమాణాలు, పరిశోధనలతోనే కాకుండా విద్యార్థుల పట్ల చూపే శ్రద్ధ, ఆప్యాయత, మద్దతుతో కూడా కొలవబడుతుందని అన్నారు. ప్రతి అధ్యాపకుడు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే మార్గదర్శిగా నిలవాలని, ఇలాంటి సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలు మరింత సానుకూల, సురక్షిత, విద్యార్థి-కేంద్రిత క్యాంపస్ నిర్మాణానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ముఖ్య వక్తగా పాల్గొన్న భారత రైల్వే మంత్రిత్వ శాఖ మాజీ అదనపు కార్యదర్శి, సర్టిఫైడ్ మైండ్ ట్రైనర్, లైఫ్ కోచ్ గిరిజా శంకర్ దాస్ మాట్లాడుతూ "ఇతరులను నడిపించే ముందు మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలి" అనే అంశంపై ప్రసంగించారు. అధ్యాపకులు ముందుగా భావోద్వేగ పరిపక్వత, ఆత్మపరిశీలన, విలువలతో కూడిన నాయకత్వాన్ని అలవర్చుకోవాలని, సానుభూతితో కూడిన బోధనే విద్యార్థులను విజయవంతమైన, బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో సుమారు 370 మంది అధ్యాపకులు పాల్గొంటుండటం విద్యార్థుల సంక్షేమానికి ఎన్ఐటీ ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమం రెండో రోజు మంగళవారం హైదరాబాద్ ఐఐటీ కు చెందిన ప్రొఫెసర్ సోమనాథ్ మాజి ఉన్నత విద్యాసంస్థల్లో మానసిక శ్రేయస్సు, భావోద్వేగ మేధస్సుపై ప్రత్యేక ఉపన్యాసం ఇవ్వనున్నారు. అనంతరం యోర్‌డోస్ట్ సంస్థకు చెందిన ఆదిత్య కాబ్రా విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి సాంకేతిక ఆధారిత కౌన్సెలింగ్ సేవల ప్రాధాన్యాన్ని వివరించనున్నారు. చివరగా ప్రొఫెసర్ జి. అంబా ప్రసాద్ రావు, ప్రొఫెసర్ కమలిని దేవి వరంగల్ ఎన్ఐటీలో అమలు చేస్తున్న మెంటరింగ్, కౌన్సెలింగ్, విద్యార్థుల మానసిక ఆరోగ్య కార్యక్రమాలపై తమ అనుభవాలను పంచుకోనున్నారు.

## విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని

# గ్రీవెన్స్ లో వినతిపత్రం అందజేత

- భూపతిపేట సబ్ స్టేషన్ లో విలేజ్ కంట్రోల్ ఏబి స్విచ్ లు ఏర్పాటు చేయాలి
- వెంగంపేట ఉప సర్పంచ్ కట్ల భవాని విష్ణు



**గూడూరు, జులై05 (జనం సాక్షి):** వెంగంపేట గ్రామపంచాయితీ పరిధిలో ఉన్న భూపతిపేట, విద్యుత్ సబ్ స్టేషన్ క్రింద వెంగంపేట, భూపతిపేట, చిన్నాఎల్లపురం, సీతానగారం, కోబల్ తండ,లైన్ తండా గ్రామపంచాయితీలు ఉన్నాయని, ఒక్కొక్క గ్రామ పంచాయితీ పరిధిలో మూడు నుండి ఆరు హాబిటేషన్ గ్రామాలు,తండాలు, సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఏ ఒక్క గ్రామంలో విద్యుత్ సమస్య తలెత్తిన,ఎల్ సి తీసుకుంటే ఆరు గ్రామ పంచాయితీల పరిధిలో ఉన్న గ్రామాలు మొత్తం, అంధకారంలోనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతుందని, ప్రతి గ్రామానికి ఒక విలేజ్ కంట్రోల్ ఏబి స్విచ్ లను ఏర్పాటు చేసి,విద్యుత్తు అంతరాయం ఉన్న గ్రామానికి,తప్ప మిగతా గ్రామాలకు విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని సోమవారం గ్రీవెన్స్ లో వినతిపత్రం అందజేశాము. వెంగంపేటలో త్రి ఫేజ్ విద్యుత్తు లైన్లో కేబుల్ పాతబడి, నిరంతరం విద్యుత్ అంతరాయం కలుగుతుందని,దాని స్థానంలో కొత్తగా కండక్టర్ ని ఏర్పాటు చేసి,రైతులకు నిరంతరం,అంతరాయం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా భవానివిష్ణు మాట్లాడుతూ విద్యుత్తు అధికారులు స్పందించకుంటే,సబ్ స్టేషన్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

**వివిధ విభాగాలకు చెందిన 85 ఫిర్యాదుల స్వీకరణ**



**వరంగల్ ఎంజీఎం, జూలై 6(జనంసాక్షి):** ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారం లో నిర్లక్ష్యం తగదని బల్దియా కమిషనర్ టి.వెంకన్న అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని జీ డబ్ల్యు ఎం సి ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కమిషనర్ నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా ఎస్ ఈ రాజ్ కుమార్ సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, ఇంచార్జి సి పి రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య సెక్రటరీ అనిల్ బాబు, హెచ్ ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి



**నల్లబెల్లి, జూలై 0 (జనంసాక్షి):** నిరుద్యోగ యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్ఆర్ మిల్క్ పార్లర్ ను మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి అతను ప్రారంభించారు. ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో మిల్క్ పార్లర్ షాప్ యజమాని మామిళ్ల పెల్లి రాజు, స్థానిక సర్పంచ్ నాగెల్లి జ్యోతి ప్రకాష్, లెంకాలపల్లి సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి రవీందర్, మాజీ సర్పంచులు రాజారాం, చేరాలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.